సింగిల్ పేజీ కథ

# పడగ నీడ

-ఎన్.హరిప్రియ

తన గదిలోకి రాకెట్‌లా దూసుకొచ్చిన రవళిని చూసి అంత వరకూ ఆ నవయవ్వన 'అభిసారిక' ను గురించే దీర్ఘంగా ఆలోచిస్తోన్న ఆ ప్రముఖ ఇండస్ట్రీ ఎం.డి. యాంగ్రీ యంగ్‌మెన్ మన్మోహన్ స్పృహలో కొచ్చాడు. విస్ఫారిత నేత్రాలతో ఆమెను నఖశిఖ పర్యంతం పరికించి చూస్తూ...

"వా...ట్...రవళీ!...వాట్ హేపెండ్?" గాభరా నటిస్తూ అడిగాడు.

"స్సా....ర్!...నేనా సెక్షన్‌లో పనిచెయ్యను." ఆయాసంతో ఒగరుస్తూ అన్నది.

"వైనాట్?"

"....ఆ...రాస్కెల్స్...ఆ స్కౌండ్రల్స్...పెళ్ళాం చచ్చిన పరాంకుశం గాడి దగ్గర్నుండీ పెళ్ళాం బ్రతికున్న గుర్నాధం దాకా నన్ను ఆకలి చూపుల్తో తినెయ్యడమే కాక వెకిలి వేషాలేస్తూ అసహ్యపు పదజాలంతో నీచాతి నీచంగా ప్రవర్తిస్తున్నారు సార్...సార్! నేనీ ఉద్యోగం అవసరార్థం చేస్తున్నానే గానీ ఏ సరదాకో, కాలక్షేపానికో కాదు సార్. సార్! నాయీ ప్రవర్తనకి మీరు కోపగించి నన్నీ ఉద్యోగం నుండి తీసెయ్యకండి సార్. అలాంటి చీప్ మగాళ్ళు లేని సెక్షన్‌కి మార్చి నన్నూ, నాపేద కుటుంబాన్నీ కాపాడండి సార్. మిమ్మల్ని చేతులెత్తి ప్రార్థిస్తాను సార్." రెండు అరచేతుల్లో ముఖం దాచుకుని భోరుమంది.

"ఓ.కె. రవళీ! అలాంటి చీప్ మగాళ్ళ బారి నుండీ నిన్ను తప్పిస్తాను. నిజంగా నువ్వుండవలసిన చోటు అది కాదు. ప్రతీ క్షణం నా కను సన్నలలో మెలిగేలా చేసి నిన్ను కాపాడతాను. ఈరోజు నుండి నువ్వు టైపిస్టువి కాదు. నా పర్సనల్ పి.ఏ.వి" అంటూ అప్పటికప్పుడే రెడీగా ఉంచుకున్న అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాగితాలు చేతిలోపెట్టాడు.



"థాంక్యూ సార్. థాంక్యూ వెరీమచ్" ఎంతో కృతజ్ఞతగా అంటూ కన్నీరు తుడుచుకుని కాగితాలు అందుకుంది. అంతే! రవళి సీటు మన్మోహన్ రూంకి ఇమ్మీడియెట్‌గా మారిపోయింది...

ఎంతో ఏకాగ్రతగా తలొంచుకుని తనపని తాను చేసుకుపోతున్న రవళిని తన ఎక్స్‌రే చూపుల్తో కొలతలు కొలుస్తూ కలల ఊహల్లో తేలిపోతూ నీడను ఇచ్చినట్లే ఇచ్చి అవకాశం కోసం కాచుకున్న నాగుపాములా ఉన్నాడు మన్మోహన్...

కాని...పాపం పిచ్చి రవళి!

తనని ఈ రూంలోకి తన కళ్ళెదుటకి మార్చటానికి అతనే ప్లాన్డ్‌గా పరాంకుశం, గుర్నాధం గాళ్ళకి బోనస్ ఆశ అదనంగా చూపి నాటకమాడించి తన పి.ఏ. పద్మనాభానికి అనుమానం రాకుండా చేసి రిక్వెస్ట్‌తో అదే జీతానికి అతన్నా సెక్షన్‌కి మార్చి రవళిని తన గదికి రప్పించి, తన దగ్గర ఉద్యోగావకాశాలున్నా ఈ వేషాలు స్వాగటానికీ, బైట పడకుండా ఉండటానికీ తన చెల్లెలు ప్రీతిని మరో కంపెనీలో జాయిన్ చేసినట్లు రవళికి తెలీదు.

రవళి ఉన్న పరిస్థితుల్లోనే తన చెల్లెలు ప్రీతి కూడా అలాంటి మగ ప్రపంచంలోనే ఇరుక్కుని సతమతమౌతోందని పాపం మన్మోహన్ 'మగ' ఊహక్కూడా అందలేదు.

-ఎన్.హరిప్రియ
శ్రీరామా రైస్‌మిల్
స్టూవర్ట్‌పురం
బాపట్ల తాలూకా,
గుంటూరు - జిల్లా.